క్లుప్తంగా

పరిసరాల శుభ్రత మన బాధ్యత



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వైవీయూ : పరిసరాల పరిశుభ్రత, సహజ వనరుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–3 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై. సావిత్రి అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కడప నగరంలోని శివానందపురంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపులో నాల్గవరోజు పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ



పైపులైన్ లీకేజీ వల్ల వృథా అవుతున్న నీరు

కడప కార్పొరేషన్ : కడప నగరం రామాంజనేయపురం పరిధిలోని జర్నలిస్టు కాలనీలో తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. మూతపడిన వాటర్ ప్లాంట్ సమీపంలో లీకేజీ అవడంతో నీరు వృథాగా పోతున్నాయి. రోడ్డుపై బురద ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి పైపులైన్ బాగు చేయాలని వారు కోరుతున్నారు.

మట్టి నమూనాలను సేకరించాలి



భూసార పరీక్షా కేంద్రంలో పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు

కడప అగ్రికల్చర్: పంట పొలాలు ఖాళీగా ఉన్నప్పుడే మాత్రమే మట్టి నమూనాలను సేకరించాలని భూసార కేంద్ర సహాయ సంచాలకులు లక్ష్మీదేవి సూచించారు. మంగళవారం జిల్లాలోని రైతు భరోసా కేంద్ర సహాయకులకు మట్టి నమూనా సేకరణ, విశ్లేషణ, ఎరువుల మోతాదు సిఫారసులపై ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలం గట్లు, చెట్ల దగ్గర, కాలిబాటల్లో, ఎరువుల కుప్పలదగ్గర, ఎరువులు వేసి ఉన్న పొలంలో మట్టి నమూనాలను సేకరించరాదన్నారు. ఇలా చేయడం వల్ల సరైన ఫలితాలు రావన్నారు. జిల్లావ్యాప్తంగా త్వరలో మట్టి నమూనా పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు.

పిల్లల ఆరోగ్య విషయాలపై జాగ్రత్తలు అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

కడప కోటిరెడ్డిసర్కిల్: చిన్న పిల్లల ఆరోగ్య విషయాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కవిత తెలిపారు. మంగళవారం నగరంలోని అక్కాయపల్లిలోని ప్రాంతీయ బాలసదన్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లలకు అందుతున్న వసతి సదుపాయాలను తెలుసుకున్నారు. వంట గదులను, వసతి గదులను పరిశీలించారు. వేసవిలో తగు జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప వారి దృష్టికి తీసుకురావచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాంతీయ బాలసదన్ సిబ్బంది చిన్నారులు పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పశు సంవర్ధక శాఖ డీడీ అచ్చన్న హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని అఖిలపక్ష నాయకులు వెంకట శివ, ఎన్. రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పశు సంవర్ధక శాఖ డీడీ అచ్చన్న మృతికి సంతాపంగా నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసుల నిర్లక్ష్యవైఖరి వల్లే ఈ హత్యకు కారణమన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు రామ్మోహన్, పులి కృష్ణమూర్తి, వరలక్ష్మీ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్ఆర్ ఆసరా సంబరాలు

వల్లూరు : మండలంలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో బుధవారం ఉదయం 10:30 గంటలకు వైఎస్ఆర్ ఆసరా సంబరాలు కార్యక్రమం జరుగుతుందని ఈవోపీఆర్‌డీ ప్రసాద్, వైఎస్ఆర్ క్రాంతి పథం ఏపీఎం శైలజ తెలిపారు. ఇందులో కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని వైఎస్ఆర్ ఆసరా మూడవ విడతకు సంబంధించి మెగా చెక్కును పంపిణీ చేస్తారని తెలిపారు. మండల పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని వారు కోరారు.

జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పండుగ



మహిళలకు మెగా చెక్‌ను అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సమావేశానికి హాజరైన మహిళలు

- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా
- 3706 మంది లబ్ధిదారులకు రూ.3.79 కోట్ల వైఎస్సార్ ఆసరా మంజూరు

కడప కార్పొరేషన్ : జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాల పండుగలు ప్రతినెలలో జరుగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక మరియపురం చర్చి ఆవరణలో నగరపాలక సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో 3వ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని 'నవరత్నాల' ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. జగనన్న ప్రభుత్వంలోనే మహిళా ఆర్థిక స్వావలంబన, సాధికారతకు పెద్ద పీట వేశారన్నారు. ఇందులో వైఎస్సార్ ఆసరా పథకం కూడా ఒకటన్నారు. మహిళా లబ్ధిదారులు కుటుంబ స్థాయిలో మెరుగైన జీవనోపాధులు అందిపుచ్చుకునే విధంగా అవకాశాలు కల్పించడం సంపద సృష్టి ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా సుస్థిర మైన జీవనోపాధి కల్పించడమే లక్ష్యమన్నారు. స్వయం సహాయ సంఘాల్లో ఉన్న మహిళల ఆర్థిక ఇబ్బందులను పాదయాత్రలో కళ్లారా చూసిన వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల రోజు వరకూ ఉన్న అక్కచెల్లెమ్మల పొదుపు సంఘాల బ్యాంకు రుణాల మొత్తం సొమ్మును నాలుగు దఫాలుగా అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం మెప్మా పీడీ రామమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, కార్పొరేటర్ షఫీ, చల్లా రాజశేఖర్, ఎన్. సుబ్బారెడ్డి, బంగారు నాగయ్య యాదవ్, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు ప్రసంగించారు. ఆ తర్వాత మహిళలకు మంత్రి చేతుల మీదుగా మెగా చెక్‌ను అందజేశారు. వాల్‌పోస్టర్లు, స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎంఎం హరిప్రసాద్‌రెడ్డి, నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ మహిళా జోనల్ ఇన్‌చార్జి రత్నకుమారి, క్రిష్ణవేణి పాల్గొన్నారు.

హాకీ పోటీల్లో క్రీడాపాఠశాల విద్యార్థుల ప్రతిభ



హాకీ క్రీడాకారిణులను అభినందిస్తున్న ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్, కోచ్ ఖాదర్‌బాషా

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాల క్రీడాకారిణులు హాకీ ఇండియా జూనియర్ మహిళల సౌత్‌జోన్ చాంపియన్‌షిప్–23లో సత్తా చాటారు. ఈనెల 19 నుంచి 26 వరకు తమిళనాడు రాష్ట్రం రామనాథపురంలో నిర్వహించిన సౌత్‌జోన్ హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో క్రీడాపాఠశాల విద్యార్థినులు ముగ్గురు కాంస్యపతకం సాధించారు. 7వ తరగతి చదువుతున్న టి. కావ్య, జి. నందిని, పి.ముజియాబేగంలు ఏపీ హాకీ జట్టుకు ప్రాతినిథ్యం వహించి కేరళపై జరిగిన మ్యాచ్‌లో 9–0 తేడాతో విజయం సాధించి మూడోస్థానంలో నిలిచారు. క్రీడాకారిణులను క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్, హాకీ శిక్షకుడు కె. ఖాదర్‌బాషా అభినందించారు.

ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించాలి



కేసీ కెనాల్ పరివాహక ప్రాంతంలో పర్యటిస్తున్న అఖిలపక్ష నేతలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేసీ పరివాహక ప్రాంతంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని అఖిలపక్ష నాయకులు సత్తార్, అయ్యవారయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని కేసీ కెనాల్ పరివాహక ప్రాంతంలో ఇళ్లను కూల్చి వేసిన ప్రాంతాలను అఖిలపక్ష నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీ కెనాల్ పక్కన నివసిస్తున్న వారు అందరూ పేద ప్రజలే అన్నారు. ఇక్కడి ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ అయి ఉన్నాయన్నారు. మున్సిపల్ అధికారులు ఆస్తి, నీటి పన్ను వంటివి తీసుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడు రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్లను కూల్చితే పేద ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అఖిలపక్ష నాయకులు చంద్రా రెడ్డి, ఓబులేసు, జమీలా, తస్లీమర్, మద్దిలేటి పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన నిరసన



రెండవ రోజు కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును అంగుళం కూడా ఎత్తు తగ్గించరాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఈ విషయమై సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేస్తున్న దీక్షలు మంగళవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ హోదా కలిగిన పోలవరం ప్రాజెక్టు కేంద్ర, రాష్ట్ర నిర్లక్ష్యంతో పూర్తికి నోచుకోక సామర్థ్యాన్ని తగ్గించే కుట్ర జరుగుతోందన్నారు. 150 అడుగుల గరిష్ట నీటి మట్టంతో 294 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన పోలవరం ప్రాజెక్టు ఖర్చు కేంద్ర ప్రభుత్వం భరించాల్సి ఉండగా మోదీ ప్రభుత్వం రోజుకో ప్రకటన చేస్తూ నిధులు కేటాయింపులో నిర్లక్ష్యం చూపుతోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నీటి పారుదల పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి కేంద్రం ఒత్తిడి తీసుకువచ్చి నిధులను రాబట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, నాయకులు పులి కృష్ణమూర్తి, కెసీ బాదుల్లా, నాగ సుబ్బారెడ్డి, ఆంజనేయులు, బషీరున్నీషా, కెసీ బాదుల్లా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మిషన్ లెర్నింగ్‌తో ఎన్నో ప్రయోజనాలు



మాట్లాడుతున్న ఆచార్య నాగరాజు

వైవీయూ: మిషన్ లెర్నింగ్‌కు సంబంధించిన అప్లికేషన్స్‌పై లోతైన అవగాహన, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు అత్యంత ఆవశ్యకమని ప్రొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. నాగరాజు పేర్కొన్నారు. వైవీయూ కంప్యూటర్ సైన్స్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ అప్లికేషన్స్' అంశంపై రెండురోజుల జాతీయ సెమినార్ రెండోరోజు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్యరంగం, బ్యాంకింగ్, పరిపాలన విభాగాల్లో మిషన్ లెర్నింగ్ ఉపయోగాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సదస్సు కన్వీనర్ రెడ్డయ్య మాట్లాడారు. అధ్యాపకులు డా. శ్రీనివాసరావు, సుశీల్‌కుమార్, శివజ్యోతి, శ్వేత, అమృతపాణి, కరుణసాగర్, హనుమంతునాయక్, కృష్ణయ్య, నారాయణరెడ్డి, రాజరాజేశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనలో యువత ముందుండాలి



ఎంఎస్ఎంఇ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మెన్ దేవరాజున్ను సన్మానిస్తున్న యాజమాన్యం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పరిశ్రమల స్థాపనలో యువత ముందుండాలని ఎంఎస్ఎంఇ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మెన్ దాసరి దేవరాజు, స్విస్ట్ కళాశాల చైర్మెన్ రాజోలి వీరారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగర శివార్లలోని స్విస్ట్ ఇంజనీరింగ్ కళాశాలలో యువ శక్తి పారిశ్రామిక అభివృద్ధి అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన దేశంలో పరిశ్రమలు స్థాపించుటకు యువత, మహిళలు ముందుకు రావాలన్నారు. పరిశ్రమలు స్థాపించే వారికి పట్టుదల, సామాజిక బాధ్యత అవసరమన్నారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ చంద్ర ఓబుల్ రెడ్డి, అన్ని విభాగాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : భారత రత్న డా. బీఆర్ అంబేడ్కర్ జయంతి వారోత్సవాల పోస్టర్లను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ కె. సురేష్ బాబు ఆవిష్కరించారు. మంగళవారం స్థానిక అపూర్వ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాలకు రాజ్యాంగం ద్వారా సమాన అవకాశాలు కల్పించిన గొప్ప మేధావి అంబేడ్కర్ అని కొనియాడారు. మన దేశానికి రాజ్యాంగాన్ని బహుమానంగా ఇచ్చిన డా. బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని భావించడం సంతోషదాయకమన్నారు. అనంతరం జై భీమ్ మాల మహాసేన అధ్యక్షుడు పి. సంపత్ కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి 14వ తేది వరకూ ఈ వారోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. మాల మహాసేన నాయకులు సీహెచ్ వినోద్, రత్నకుమారి, కె. లావణ్య, వసంత్, సునీల్, శ్యాంసన్, శివ, చిన్ని, ఇరగయ్య పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని ఎస్ ఎస్ సొల్యూషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇస్తామని సెంటర్ హెడ్ యూసుఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7095499870, 8106059836లో సంప్రదించాలన్నారు.

'స్పెషల్ బ్రాంచ్'సేవలు అభినందనీయం

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



కడప వన్‌టౌన్ ఎస్‌బి హెడ్‌కానిస్టేబుల్ శ్యాం సుందర్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



కడప తాలూకా ఎస్‌బిహెచ్‌సీ శంకర్‌నాయక్



కొండాపురం ఎస్‌బి హెచ్‌సీ నరసింహులు



తొండూరు పిఎస్ ఎస్‌బిహెచ్‌సి వెంకటేష్



















మహిళా పోలీసులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : పోలీసుశాఖలో స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాత్ర కీలకమనీ ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా ఎస్పీ ఇటీవలి కాలంలో అత్యుత్తమ పనితీరు కనపరిచిన స్పెషల్ బ్రాంచ్ సిబ్బందిలో నలుగురికి ప్రశంసాపత్రాలను అందజేశారు. వీరిలో కడప వన్‌టౌన్ (ఎస్‌బీ హెచ్‌సి-1783)పి. శ్యాంసుందర్, కడప తాలూకా (ఎస్‌బీ హెచ్‌సీ–1477) ఎం. శంకర్‌నాయక్, కొండాపురం (ఎస్‌బీహెచ్‌సి 1812) వి. నరసింహులు, తొండూరు పీఎస్ (ఎస్‌బీ హెచ్‌సి 1425)పి. వెంకటేష్ ఉన్నారు.

మహిళా పోలీసుల సేవలు అభినందనీయం

బాల్యవివాహాలను అరికట్టడంలో, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో మహిళా పోలీసుల సేవలు అభినందనీయమనీ ఎస్పీ పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో అత్యుత్తమ పనితీరు కనపరిచిన 30 మంది మహిళా పోలీసులను అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆయా వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో విధులు నిర్వర్తించే మహిళా పోలీసులు స్కూల్ డ్రాప్ ఔట్స్ గుర్తించి తిరిగి స్కూళ్లలో చేర్పించేలా కృషి చేయడం, ఈవ్‌టీజింగ్, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యక్రమాల గురించి క్షేత్రస్థాయిలో ఆరా తీసి ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలనీ సూచించారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో విధులను నిర్వర్తించాలనీ ఎస్పీ ఆకాంక్షించారు. ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఎస్ఈబీ అదనపు ఎస్పీ పూజితనీలం, దిశ డిఎస్పీ వాసుదేవన్, జిల్లాలోని డిఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మా నమ్మకం మహిళా మణులే

ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి



డ్వాక్రా మహిళలకు మెగా చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నమ్మకం మహిళా మణులే అని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మూడవ విడత వైఎస్ఆర్ ఆసరాలో భాగంగా డ్వాక్రా మహిళలతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు అన్నింటా పెద్ద పీట వేసిందన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మహిళలను మోసం చేశారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డ్వాక్రా రుణాలను విడతల వారీగా మాఫీ చేస్తున్నారని తెలిపారు. మండలంలోని డ్వాక్రా సంఘాలకు సంబంధించిన మహిళలకు దాదాపు రూ.5 కోట్లు రుణాలను మాఫీ చేశారన్నారు. జగనన్న అమ్మ ఒడి ద్వారా తల్లులకు ప్రతి ఏటా రూ.15 వేలు ఇవ్వడంతో పాటు అర్హులైన వారందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు. మీ ఓటు ఎంతో విలువైనదని శక్తివంతమైనదని ప్రతి ఒక్కరూ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను గుర్తించి రాబోవు ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వేయించి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, మాజీ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ రవికుమార్‌రెడ్డి, ఏపీఎం వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యమని.. స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ద్వారా క్రమశిక్షణతోపాటు నైతిక విలువలు రూపుదిద్దుకుంటాయని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప శంకరాపురం స్కౌట్ ప్రాంతీయ కార్యాలయంలో స్కౌట్ మాస్టర్ల, గైడ్స్ కెప్టెన్లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక సేవ, దేశభక్తి పెంపొందించడానికి స్కౌట్ శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. బేసిక్, అడ్వాన్స్‌డ్ శిక్షణ పొందిన వారే తమ విద్యార్థులకు సమగ్రమంగా శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. యూనిట్ లీడర్లు అందరూ సేవా భావం కలిగి క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమీషనర్ లక్ష్మీకర్, అసిసెంట్ సెక్రటరీ శివప్రసాద్ , ట్రెజరర్ రమణయ్య, ఎల్‌ఓసీలు, వెంకటేశ్వర్లు, శకుంతలమ్మ, శంకర మ్మ, ఎస్‌టిసిలు ఉపాదేవి, మోహన్‌రావు, ఎస్‌ఓసీలు శివప్రసాద్, రజియా బేగం, రెండు జిల్లాల స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్ మెయిన్ రోడ్డు నిర్మాణానికి చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : ప్రకాష్ నగర్ మెయిన్ రోడ్డు నిర్మాణానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో ఆయన 14వ డివిజన్ కార్పొరేటర్ కె.బాబుతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఎన్‌టీఆర్ నగర్, నిరంజన్ నగర్ డ్రైన్‌లలో పూడిక తీసి, శుభ్రం చేయాలన్నారు. భూగర్భ డ్రైనేజీకి మరమ్మతులు చేయాలన్నారు. స్థానిక ప్రజలతో మాట్లాడి పారిశుధ్యం, నీటి సరఫరా గూర్చి తెలుసుకున్నారు. అనంతరం రాజీవ్ పార్కును పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రాజీవ్ మార్గ్ డ్రైన్ పనులను వేగవంతం చేయాలన్నారు. మాసాపేట రోడ్డు నిర్మాణంలో నాణ్యతా లోపాలు లేకుడా చూసుకోవాలన్నారు. కేసీ కెనాల్ మీదుగా 40 అడుగుల రోడ్డు నిర్మాణం చేయుటకు ఇళ్ల డాక్యుమెంట్లను పరిశీలించి విస్తరణ పనులు చేపట్టాలన్నారు. దేవునికడప వైపు నుంచి పనులు మొదలు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీ సంజీవ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, డీఈలు పాల్గొన్నారు.

రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలను అందచేయాలి

ఉద్యానశాఖ అధికారుల సమీక్షా సమావేశంలో సంబటూరు ప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథ రెడ్డి

కడప అగ్రికల్చర్ : జిల్లాలో బిందు, తుంపర సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు సకాలంలో పరికరాలను అందచేసి వారి అభివృద్ధికి దోహద పడాలని రాష్ట్ర ఉద్యానశాఖ ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో ఉద్యానశాఖ అధికారులు, కంపెనీ ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బిందు,తుంపర సేద్య పరికరాలపై మంజూరు లక్ష్యం, పంపిణీ తదితర వాటి గురించి అధికారులను అడిగారు. ఇందుకు ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి సూక్ష్మ సేద్యంకు 8 వేల హెక్టార్లు లక్ష్యంగా నిర్దేశించగా ఇందులో 8700 హెక్టార్లకు పరిపాలన అనుమతులను తీసుకోవడం జరిగిందన్నారు. ఇందులో 6046 హెక్టార్లకు బిందు, తుంపర సేద్య పరికరాలను రైతులకు అమర్చామన్నారు. మిగిలిన రైతులకు కూడా త్వరితిగతిన అందించేందు కంపెనీ ప్రతినిధులతో చర్చించి అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి,ఎంఐ ఇంజనీర్లు, ఎంఐడీసీలు, జిల్లా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాకు తరగని కీర్తి.. పుట్టపర్తి



పుట్టపర్తి నారాయణాచార్యుల చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్ర సంచాలకులు

కడప కల్చరల్ : సరస్వతి పుత్ర పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు మన జిల్లాకు తరగని కీర్తిగా నిలిచారని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్ర సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి నారాయణాచార్యులు 110వ జయంతిని మంగళవారం బ్రౌన్ కేంద్రంలో నిర్వహించారు. తొలుత పుట్టపరిత చిత్ర పటానికి ఆయన సిబ్బందితో కలిసి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. అనంతరం ఆచార్య మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ 14భాషల్లో పాండిత్యం గల పుట్టపర్తి కవిగా, విమర్శకుడిగా, అనువాదకుడు, నాటకకర్త, విమర్శకుడిగా వెలిగి వందకుపైగా గ్రంథాలు రాసిన విలక్షణ సాహితీ మూర్తి నలుదిశలా చాటిన ఘనత ఆయనదేనన్నారు. ఆయన రచించిన శివతాండవం కావ్యం ఆయనకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టిందన్నారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి , మరో సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపుడి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం గ్రంథ పాలకులు జి.హరిభూషణ రావు తదితరులు పాల్గొన్నారు.

అంతా రామమయం!



పోటీల్లో విజేతలతో కార్యక్రమ నిర్వాహకులు

కడప కల్చరల్ : వసంత నవరాత్రి వేడుకలలో భాగంగా ఏడవ రోజు మంగళవారం కడప హౌసింగ్ బోర్డు కాలని కోదండ రామాలయంలో మహిళల కోసం క్విజ్, ధారణ తదితర పోటీలను నిర్వహించారు. అన్ని పోటీలు రామాయణంలోని అంశాలే ప్రధానంగా నడిచాయి. దాదాపు 40 మందికి పైగా పాల్గొన్న ఈ పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. భగవద్గీత ప్రచారకులు అచ్చోలు ముకుందారెడ్డి, ప్రసాద్‌రెడ్డి అతిథులుగా హాజరై మాట్లాడారు. రామాయణం పట్ల నేటి తరానికి ముఖ్యంగా గృహిణులకు అవగాహన కల్పించేందుకు వారికి ప్రత్యేకంగా ఈ పోటీలు ఏర్పాటు చేయడం అభినందణీయమన్నారు. ఆలయ ధర్మకర్త డి. వెంకట రెడ్డి ఆధ్వర్యంలో వెంకటసుబ్బయ్య, ఇంజనీరు సుబ్బారెడ్డి, మహేంద్రారెడ్డిల సహకారంతో ఆసం శివకుమారి మహిళల పోటీలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ పోటీలలో భార్గవి,శ్రీలత, మాధవి, కె.మంజుల ప్రథమ స్థానాలలో నిలువగా, శ్రీవాణి, ఉషారాణి, రమాదేవి ద్వితీయ స్థానాలు సాధించారు. శ్రీవాణి, కమల, మహాలక్ష్మి, వసంత, మీధవీలత తృతీయ స్థానంలో నిలిచారు. ఈఉత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం 9గంటలకు రామాయణంలో నాకు నచ్చిన సన్నివేశం అనే అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నారు.

రేపు శ్రీసీతారాముల కళ్యాణోత్సవం

కడప కల్చరల్: హబీబుల్లా వీధిలోని శ్రీ సీతారామస్వామి ఆలయంలో గురువారం శ్రీసీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 10గంటలకు కళ్యాణం మధ్యాహ్నం 1గంటకు అన్నప్రసాద వితరణ ఉంటాయి. శుక్రవారం రాత్రి ఏడు గంటలకు శ్రీ రామ పట్టాభిషేకం, శనివారం రాత్రి 7గంటలకు ఊయల సేవ నిర్వహించనున్నారు.